# ఎన్.పి.ఏ.



**రాజా** టీవీ కట్టేసి బెడ్‌రూమ్‌కి వచ్చేసరికి భార్య సావిత్రి ఇంకా చదువుకుంటూనే వుంది. భర్తను చూసి "పిల్లలు పడుక్కున్నారా?" అంది.

"ఎప్పుడో. అయినా నీ ఇంటర్వ్యూ ప్రిపరేషన్ మాత్రం అయినట్టు లేదు. ఎందుకొచ్చిన ప్రమోషన్లు? బ్యాంక్ మేనేజర్‌గానే అవస్థ పడుతున్నావు. స్కేలు త్రీ అంటే ఇంకా పెద్ద బ్రాంచికేస్తారు. ఇంకా ఎక్కువ ప్రాబ్లెమ్స్. చెప్తే వినవుకదా!" అన్నాడు పక్కమీద వాలుతూ.

"మీరు మాత్రం ప్రమోషన్లు తీసుకోవటం లేదా? ఏమైనా అంటే 'మాకు ట్రాన్స్‌ఫర్లుండవు' అంటారు. ఎప్పుడూ వుండే ఆర్గ్యుమెంట్లేగా! అసలే ఇంటర్వ్యూ దడగా వుంటే మధ&యలో మీ హితోపదేశాలొకటి!"

"పోన్లే కానీ, మా సూరికి స్కేలు ఫోర్ ప్రమోషన్ ఇవ్వలేదట మీ బ్యాంక్ వాళ్లు..."

"బాగుంది. ఆయన బ్రాంచ్‌లో ఎన్.పి.ఏ. రికవరీ ఏ మాత్రం శాటిస్‌ఫాక్టరీగా లేదట. రాదని

ఎమ్బీయస్ ప్రసాద్

మేము ముందే అనుకున్నాం."

"ఎన్.పి.ఏ. అంటే?"

"నాన్ ఫెర్‌ఫామింగ్ అసెట్. బ్యాంక్ ఎవరికైనా అప్పు ఇచ్చిందనుకోండి. అది బ్యాంక్‌కు ఆస్తే కదా! దానిమీద వచ్చే వడ్డీని ఆదాయంగా చూపిస్తామన్నమాట. కానీ వసూలు కావేమోననిపించే బాకీలు కొన్నుంటాయిగా. వాటిమీద వడ్డీ ఏమిటి, అసలే రాదు! అది కొంతకాలం చూసి, అవి బాగుపడే లక్షణాలుంటే వాటిని జాగ్రత్తగా హేండిల్ చేసి, డబ్బు రాబట్టుకుంటారు. మరీ మొండిఖాతా అయితే చావుబాకీ కింద రాసేపారేసి, కోర్టులో కేసు వేస్తారు. మీ సూరి గారి బ్రాంచిలో ఈ ఎన్.పి.ఏ. అక్కవుంట్లు చాలా వున్నాయి. అప్పు పుచ్చుకున్నవాళ్లని మెప్పించో, నొప్పించో ఖాతాలో కొంతైనా చెల్లు వేయించివుంటే ప్రమోషన్లు వచ్చేవి. ఈయన అదేమీ పట్టించుకోకుండా..."

"బాగానే వుంది గోల! బ్యాంక్ వాళ్ల కష్టాలు బ్యాంక్ వాళ్లవి..." అంటూ ఆమె నడుం మీద చేయి వేశాడు రాజా.

అది ఎక్కడకు దారి తీస్తుందో సావిత్రికి ఎరుకే. "చాల్లెండి వేషాలు! రేప్పొద్దున ఇంటర్వ్యూ అంటే వినిపించుకోరు. మీరు పక్కనుండగా చదువు సాగదు. హాల్లోకి వెళ్లి చదువుకుంటాను" అంది ఆమె.

రాజా చెయ్యి తీయకుండా "నాకూ వుంది ఎన్.పి.ఏ." అన్నాడు. సావిత్రి ప్రశ్నార్థకంగా చూడటం గమనించి వివరించాడు – 'నాన్ పెర్‌ఫామింగ్ అసెట్ 'నువ్వే! 'వీడికేంట్రా భార్య భలే అందంగా, జబర్దస్తీగా వుంది' అనుకుంటారు జనం. కానీ వట్టి చూపుల గుర్రమనీ, పెర్‌ఫామెన్స్ లేదనీ వాళ్లకేం తెలుసు? మేనేజరుగా బాధ్యతలన్నీ తలకెత్తుకు వచ్చానంటూ ఆలస్యంగా వచ్చి, అలసిపోయి పడుక్కోవడం, చెయ్యేస్తే కరవబోవడం..."

సావిత్రికి కోపం వచ్చింది. "పెళ్లయి పదేళ్లయింది కాబట్టి జోరు తగ్గాలి. ప్రమోషనొస్తే ట్రాన్స్‌ఫర్ ఖాయం! అప్పుడేం చేస్తారు?" అంది చెయ్యి విసురుగా తోసేస్తూ.

"అందుకేగా ప్రమోషన్ వద్దంటున్నాను! వింటేగా? 'నా టాలెంటంతా వేస్టయిపోతోం'దని ఫీలవుతుంటావు నువ్వు" అని మొహం మాడ్చుకున్నాడు రాజా.

పరిస్థితి గమనించింది సావిత్రి. పుస్తకం పక్కన పెట్టింది. భర్త చేతిని తన చేతితో తీసుకొని ఓదార్చింది – "ప్రమోషన్ వచ్చాక స్టాఫ్ అసోసియేషన్ వాళ్లతో చెప్పి ఊరికి నలభై, యాభై మైళ్ల దూరంలో వున్న బ్రాంచ్‌లో వేయించుకుంటా. సరేనా?" అని.

"అలాగే జరిగినా బస్సులో పడి అలసిసొలసి వస్తావు. అప్పుడూ ఏన్పీఏగా!" అన్నాడు రాజా బుంగమూతి పెట్టి.

"అప్పుడే చూద్దాం లెండి!" అంటూ లైటార్పి వాలిందో లేదో అతని చేయి ఆమె ఛాతీమీద పడింది. ఆమె జాగ్రత్తగా ఎత్తి తీసి పక్కనపెట్టింది.

"ఆ మాటకొస్తే నీకూవున్నాయి ఎన్పీఏలు. విగ్రహపుష్టి, నైవేద్యనష్టి, చూపించి రెచ్చగొట్టడానికే గానీ చేయి వేయడానికి కూడా పనికిరావు!" అన్నాడు రాజా కచ్చగా.

సావిత్రి శాంతంగానే, "ఇప్పుడిలాటివేవీ పెట్టకండి. పొద్దున్న లేచి చదువుకోవాలి" అంది బతిమాలుతున్నట్టు. రాజా అటుతిరిగి పడుక్కున్నాడు.

పదినిముషాలు గడిచాయి. "అవునూ, నాన్‌పెర్‌ఫామింగ్‌ను పెర్ఫామింగ్‌గా మార్చటం ఎలా?" అన్నాడు రాజా.

అతని గొంతులో కొంటెదనం గుర్తించనట్టుగా, "దానికి నర్సింగ్ ప్రోగ్రాం అని ఒకటుంటుంది లెండి!" అని ఆమె చెప్పబోతూండగానే, "...అంటే లాలించడం అన్నమాట!" అంటూ ఆమె పొట్టమీద చేయివేసి నిమిరాడతను.

పొద్దున్న సావిత్రి లేచేసరికి లేటయ్యింది. క్రితంరాత్రి లొంగకుండా వుండాల్సింది. 'తను మాత్రం ఏం చేస్తుంది? రాజా చిలిపిపనులలాంటివి, తనను ఎలా రెచ్చగొట్టాలో అతనికి బాగా తెలుసు. అతన్ని ఊరుకోబెట్టకపోతే పడుకోనివ్వడని తనకు తాను నచ్చజెప్పుకుని సహకరించింది. కానీ ఒకసారి ముగ్గులోకి దిగాక తనుమాత్రం నిలవరించుకోగలిగిందా? ఇప్పుడనుకొని ఏం లాభం? ఫారిన్ ఎక్స్‌చేంజిలో ప్రిపరేషన్ లేకుండానే వెళ్లాల్సివస్తోంది. అది అడక్కుండా వుంటే బాగుణ్ను' అనుకుంది.

అదే అడిగారు. సావిత్రి కంగారు పడింది. రెండు నిమిషాల తర్వాత ఇంటర్వ్యూ చేసేవాళ్లలో ఒకాయన తన బ్రాంచ్‌లో రిపోర్టు చూస్తూ "మీదీ ఎన్పీఏ కేసేనే!" అన్నాడు.

అంత కంగారులోనూ ఆమెకు చిరునవ్వు వచ్చింది. రాత్రి చర్చ గుర్తుకు వచ్చి, ఆయన చికాకు పడ్డట్టున్నాడు - "మీ బ్రాంచిలో ఎన్.పి.ఏ.లు ఎక్కువున్నాయి కదా, వాటి గురించి ఏం చేద్దామనుకుంటున్నారు?" అన్నాడు.

తను పెర్‌ఫామింగ్ ఎసెట్‌గా మారిన విధానం తలపులోకొచ్చి, అది చెప్తే ఎలా వుంటుందన్న చిలిపి ఊహ పోయి, నవ్వు రాబోయింది. కానీ కష్టం మీద ఆపుకుంది.

ఇంటర్వ్యూ చేస్తున్న జి.ఎమ్.కు యీమె వరస అర్థం కాలేదు. నెర్వస్‌గా ఫీలయి జవాబివ్వలేక పోతోందేమో, సహాయపడదామనుకొని "నర్సింగ్ ప్రోగ్రాం ఏమైనా ప్రపోజ్ చేశారా?" అని అడిగి చూశాడు.

రాత్రి తనకు జరిగిన నర్సింగ్ ప్రోగ్రామ్ జ్ఞాపకానికి వచ్చింది సావిత్రికి. భర్త చిలిపిమాటలు, పనులు ఒక్కసారి తలలో ఝుమ్మన్నాయి. ఫక్కుమని నవ్వింది. వెంటనే సర్దుకొంది కానీ, ఇంతలో జి.ఎమ్.కి కోపం వచ్చింది.

"మీకు ఇంట్రెస్టు లేకపోతే ఇంటర్వ్యూకి వచ్చి మా టైము వేస్టు చేయకండి. లేడీస్‌కెప్పుడూ కెరీర్ మీద శ్రద్ధే వుండదు" అని సణుక్కుంటూ "యూ కెన్ గో!" అన్నాడు చీదరింపుగా.

ఆ రోజు రాజా లేటుగా ఇంటికొచ్చేసరికి సావిత్రి మహాహుషారుగా వుంది. సెలక్టయ్యావా ఏమిటి అని అడిగాడు రాజా.

"ఇంటర్వ్యూ చీదేసింది. ఎన్పీఏగా వుంటే లాభం లేదన్నారు. మళ్లీ ఏడాదిదాకా ఛాన్సు లేదుగా. ఈ లోపల బాగా పెర్ఫామ్ చేయమన్నారు!" అంటూ అతన్ని గట్టిగా వాటేసుకుని మనసారా హత్తుకొని వుక్కిరిబిక్కిరి చేసేసింది సావిత్రి.

●

(ఆంధ్రప్రభ వీక్లీ అక్టోబరు 98)

# ఆలూమగలీయం

## అందమే ఆనందమా?

> మిస్ యూనివర్స్, 2000గా భారతీయ యువతి లారా దత్తా ఎన్నిక - వార్త

"చూసారా? మళ్లీ ఇండియన్ అమ్మాయే ప్రపంచ సుందరి అయింది."

"ఇందులో నువ్వింత పొంగిపోవడాని కేముందో, నాకర్థం కాదు..."

"ఎందు కానందించకూడదు? భారతీయ స్త్రీలు అందగత్తెలని ప్రపంచమంతా మళ్లీ ఒప్పుకున్నట్టయిందిగా!"

"అంటే మధ్యలో 28 ఏళ్ల పాటు ఒప్పుకోనట్టా? 1966 నుండి 1994 దాకా ఇండియా నుంచి ఎవరూ సెలక్టవలేదు కదా!"

"మీదంతా వితండవాదం. మీ కంటికి ఇండియన్స్ అందాలు ఆనవు. ఎంతసేపూ ఒంటిమీద గుడ్డలుంచుకోని..."

"ఒక్కసారి ఆగు. ఈ పోటీలో అందం కంటే తెలివితేటలు చూస్తారని అంటారు..."

"అదంతా బోగస్ లెండి. తెలివితేటలు చూడాలంటే స్విమ్మింగ్ డ్రస్‌లో రమ్మనాలేమిటి? బురఖాలో వచ్చి సమాధానాలు చెప్తానంటే జడ్జీలు ఒప్పుకుంటారూ!?"

"అదేమో గానీ, చివరిలో సమాధానం ఇచ్చిన తీరు బట్టే ఈ అమ్మాయి నెగ్గిందని..."

"ఈ అమ్మాయే కాదు, ఏ అమ్మాయైనా అలాటి జవాబే చెబుతుంది. అంతకుముందు నెగ్గినవాళ్ల గురించి ఇలాగే రాసారు. అందరూ కూడా నెగ్గిన తర్వాత చేతులు నోటికడ్డం పెట్టుకుని ఆశ్చర్యపోవడం, పడికట్టు పదాల రియాక్షన్లు - అవన్నీ పక్కన బెట్టండి."

"పక్కన బెట్టి, ఈ అమ్మాయిలందరూ కేవలం అందం వల్లే నెగ్గారంటావ్. నాకు మాత్రం ఏ పోటీ చూసినా రెండో ప్రైజు వచ్చిన వాళ్లో, మూడో ప్రైజు వచ్చినవాళ్లో నచ్చుతారు. నా దృష్టిలోపమో, దృక్పథం లోపమో కానీ..."

"...రెండూనూ. ముఖ్యంగా ఇండియన్స్ నెగ్గుతున్న దగ్గర్నుంచీ మీరీ పాట మొదలెట్టారు. మీ కళ్లకు అందగత్తెలంటే మార్లిన్ మాన్రోనూ, అదెవత్తమ్మా... టైలరమ్మాయి... పదిసార్లు విడాకులిచ్చి, అరడజను సార్లు పాత మొగుణ్నే కట్టుకున్నది..."

"...ఆవేశపడకు. నింపాదిగా ఆలోచించి చూడు. మనవాళ్లను, వాళ్లను పోల్చి చూడు. నేనివాళ అంటున్నది కాదీ మాట. మా క్లాసుమేట్స్ కూడా మన సావిత్రి అందగత్తె అన్నప్పుడే నేను వాదించేవాణ్ని..."


"...సావిత్రి కళ్లు ఎంత అందంగా ఉండేవి చెప్పండి."

"అందం అంటే కళ్లు ఒకటేనా? మే వెస్ట్‌కున్న అందాల మాటేమిటి?"

"మే వెస్టూ, జూన్ ఈస్టూ - ఏమిటండీ వెధవ పేర్లు! మనవాళ్లు కాకపోతే చాలు, మోజు పెరిగిపోతుంది. మా పెద్దన్నయ్యా అంతే. అందరూ జమునా, వాసంతీ అంటూంటే పెద్ద గొప్పగా నాకు నార్మా షేరర్ ఇష్టం అనేవాడు, నోరు తిరక్కపోయినా."

"నార్మా షేరర్‌ది ఏ సినిమా చూసాడు?"

"ఏం చూసాడు? సినిమాకెళితే మా నాన్నగారు చావగొట్టేవారు. అందులోనూ ఇంగ్లీషు సినిమా



అంటే మరీను. శ్రీశ్రీ పద్యం ఏదో చదివాడు మా అన్నయ్య. దాంట్లో ఉన్నట్టుంది.."

"..కరెక్టు. 'రాక్సీలో నార్మా షేరర్. బ్రాడ్వేలో కాంచనమాల' ఎటు వెళ్లాలో తేల్చుకోలేకపోయాడు ఒక విద్యార్థి అనో, ఏదో ఉండాలి.." "..అదే, దానివల్లే ఆ స్టారు పేరు తెలిసింది వీడికి. అప్పణ్నుంచి 'మీరైతే కాంచనమాల కోసం వెళ్లేవాళ్లేమో కానీ నేనైతే నార్మా' అనేవాడు, అప్పటికింకా దాని ఫోటో కూడా చూడకపోయినా. చివరికి ఎవళ్లో తరచి అడిగితే ఇక లాభం లేదని ఫోటో సంపాదించి ఎలా ఉంటుందో తెలుసుకున్నాడు..."

"...అందరూ మీ అన్నయ్యలాగానే ఉంటారనుకున్నావా? నన్నడిగితే మార్లిన్‌మన్రో, ఎలిజిబెత్ టేలర్ కొలతలు అప్పజెబుతాను."

"అక్కర్లేదు. కొలతలు గుర్తుంచుకోవలసినది టైలర్. అలాటిది టైలర్ కొలతలు మీకెందుకు? నేననేది ఇండియన్ అమ్మాయిలు అందగత్తెలని ఒప్పుకోమంటున్నాను."

"ఇండియాలో అందరూ అందగత్తెలా? అయినా అందానికి మనం ఇచ్చే నిర్వచనం వేరు, మరోళ్లు ఇచ్చేది వేరూ కావచ్చు. ఆఫ్రికాలో పెదాలు పెద్దగా ఉంటే అందం కావచ్చు, చైనాలో పెదాలు లేకపోతే అందం కావచ్చు. ప్రపంచంలో అందరి తరఫునా నిర్ణయించడానికి వాళ్లెవరు? వాళ్ల తాతాచార్యుల ముద్రను మనం ఒప్పుకోవాలా?"

"పోనీ ఒప్పుకోకండి. లారా దత్తాకు వెళ్లి చెప్పండి, నిన్ను అందగత్తెగా నేను పరిగణించటం లేదాహోయ్ అని. పోవోయ్ పుల్లయ్యా అంటుంది."

"లారాదత్తా కెందుకలా చెబుతాను? ఆ అమ్మాయి అందంగా ఉంటేను."

"ఆఁ!?"

"అంత ఆశ్చర్యం ఎందుకు? నేనిందాకటినుంచీ అంటున్నదేమిటి? ఇండియన్సందరూ అందగత్తెలని జనరలైజ్ చేయవద్దంటున్నాను. అందాలపోటీ విధానం బాగాలేదంటన్నాను. అంతేగానీ లారా గురించి ఏమీ అనలేదే!"

"అంటే మీ ఉద్దేశ్యంలో.."

"..లారా మంచి అందగత్తె. మరీ గడకర్రలా లేదు. మంచి ఎత్తు. చక్కటి అవయవసౌష్టవం. నడుస్తూంటే..."

"...ఏడిసినట్టుంది."

"ఎవరు?"

"ఇంకెవరు? లారాదత్తాయే! కొంగలా మొహం అదీను. అంత సన్నం ఏమిటి బాబూ!"

"అదేమిటి? నువ్వు తనని మెచ్చుకుంటున్నావనుకున్నాను."

"నేను మెచ్చుకునేది ఆ పర్టిక్యులర్ అమ్మాయిని కాదు, ఇండియన్ లేడీస్ అందాలని! ఇండియన్ లేడీస్ అంటే దాంట్లో పోటీలకెళ్లని నాలాటి వాళ్లు కూడా ఉంటారు."

"అదేమిటి అలా ప్లేటు ఫిరాయించేసావ్?"

"అదంతే! మీ కర్థం కాదు లెండి. లేకపోతే పరాయిపిల్ల పొంగులు, హంగుల గురించి మీరు వర్ణిస్తూ ఉంటే నేను వంట మానేసి మీకు తాళం వేస్తూ కూచోవాలి కాబోలు. ఆ పేపరు పడేసి వెళ్లి కూరలు తెండి ముందు! కుదరకపోతే ఆ లారా దత్తాకు చెప్పండి, వండిపెడుతుందేమో!" ●